


1984 దీపావళి కథలపోటీలో రు. 650/- బహుమతి పొందిన కథ

# మోగని మువ్వ

**రాఘవయ్య మహానటుడు!**
**ఎప్పుడు?**
**ఇరవై, ఇరవై అయిదేళ్ళ క్రితం వరకూ –**
**ఇప్పుడు ?**

**తన పాత్రని జీవనరంగం మీద ఎల్లా పోషించు-కోవాలో తెలియక, ఖూటికి కరువై, నా అన్న వాళ్ళు లేక – కూలి పోడానికి సిద్ధంగా ఉన్న తన ఇల్లే లోకంగా గడుపుతున్నాడు!**

మూడు దశాబ్దాలు నాటక రంగాన్ని పోషించి – ఎన్నో పాత్రలకి జీవంపోసి – వృద్ధాప్యం పులి కోరల్లో చిక్కి, ఈతరంచేత విస్మృతి చేయబడిన మహా మహా నటుడు రాఘవయ్య – ఈనాడు – ఒంటరి!

చిన్నప్పుడే రాఘవయ్య తన తండ్రి దగ్గర క్షుణ్ణంగా పంచ కావ్యాలూ, నాటకాలంకారాలూ చదువు కొన్నాడు! తెలుగు జ్ఞానానికి కొదవలేదు! పైగా రూపసి!

ముఖానికి రంగేసుకుంటే గడపలో అడుగు పెట్టక్కర్లేదు– అని శాసించిన తండ్రిని – "నాయనా! మన ఇంటా వంటా లేని ఈపాడు వేషాల గోల మన కెందుకురా!" అని కన్నీళ్లతో తనను అనునయించిన తల్లిని – కూడా కాదని, తొలి సారి పదిహేనేళ్ల వయస్సులో స్త్రీ పాత్ర దరించి సభ్యుల ప్రశంస లందుకున్నాడు రాఘవయ్య!!

భావ యుక్తంగా పద్యం చదవడంలో గాని – అభినయంలో కాని కొత్త ఒరవడి పెట్టి తెలుగు నాటక రంగాన్నే ఒక మలుపు తిప్పాడు దానికి తోడు ఓ నాటక సమాజం కూడా స్థాపించాడు

పెళ్లాం – పిల్లాడు అని లేకుండా ఊళ్ళు తిరిగాడు! ఎక్కడికి వెళ్ళినా సన్మానాలూ మెళ్ళో దండలూ, ప్రేక్షకుల చప్పట్లూ, పతకాలూ, స్వర్ణ కంకణాలూ

తండ్రి ఇచ్చిన కొద్దిపాటి కొండ్రా అమ్మేసి నాటక సమాజానికి పెట్టేసాడు!

సమాజంలో మనుషులకి ఏ కష్టం వచ్చినా – రాఘవయ్యే ఆపద్బాంధవుడు!! సంపాదించిందంతా హారతి కర్పూరం అయిపోయింది!

రాఘవయ్య పెళ్లాం గుండె జబ్బు మనిషి!

ఈ నాటకాల పిచ్చిలో బడి భార్యకి సరైన వైద్యం చేయించలేక పోయినాడు! చివరికి ఆవిడ చనిపోయే నాటికి కూడా ఊళ్లో లేకుండా పోయాడు!

ఒక్కగా నొక్క కొడుకు!

మొగాడి పెంపకం!

ఎల్లాగో ఇంటర్‌దాకా చదివినట్టే చదివాడు!



తరవాత ఐపు లేకుండా పోయాడు!

ఆరోజు  రాఘవయ్యకి బాగా జ్ఞాపకం!

కాలేజీ నుండి కొడుకు  తూలుతూ వచ్చాడు తాగి!

రాఘవయ్య కోపం ఆపుకోలేక పొయ్యాడు!

కొడుకుని దవళ్ళు వాచి పోయేలా కొట్టాడు!

అంతే!!

తెల్లారి – వాడు మళ్ళీ రాఘవయ్య కళ్ళ బడలేదు – ఇప్పటికీ కూడా!!!

ఆస్తినంతా మింగేసిన నాటక సమాజం కూడా చేజారిన సీసాలా ముక్కలైపోయింది!!

శిధిలాలయంలా ఉన్న తాత కట్టించిన ఇంట్లో – రామవయ్య మాత్రం మిగిలాడు! ఒంటరిగ్యా!!

తన నటనకి ముగ్ధులై ఒకనాడు ప్రజ లిచ్చిన వెండి పతకాలు గెల్చుకున్న స్వర్ణ పతకాలూ బంగారం కొట్టు కెళ్ళిపోయినాయ్!

రాఘవయ్య ఆకలి మంటలో కరిగి పోయాయ్!

వృద్ధాప్యం – పొంచిన పులిలా మీది కురికుంది!

సన్మాన పత్రాల ఫోటోలు మాత్రం – రాఘవయ్య జీవితంలాగే సగం సగం చెదలు కొట్టేయగా పెళ్ల-లూడిన గోడలికి వేలాడుతున్నాయ్!

ఒకనాడు రాఘవయ్య నాటక సమాజంలో చిన్న చిన్న వేషాలేసిన నటులు – నేడు మహా నటులై పోయారు!!

తెలుగు చలన చిత్ర సీమకు మహా రాజులై పోయారు!

కెమెరా ముందు కుప్పి గంతులేసి లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు! కానీ రాఘవయ్య

లౌక్యం తెలియక, సంప్రదాయం మరిచి పోలేక – నాటకాల కోసం రక్త మాంసాలు అర్పించేసి – చివరికి దీనంగా, హీనంగా రోజుల్ని గడుపుతున్నాడు!

ఎవరో సలహా ఇస్తే తన సమాజంలో నటించి సినీ రంగానికి వెళ్ళిన తారలకి తన దీనస్థితి అంతా వివరిస్తూ సహకారం అర్థించాడు!

కానీ

తారలు తారలే!

వాటిని సృష్టించిన రాఘవయ్యకి కూడా అవి అందనంత ఎత్తుకు ఎదిగిపోయాయ్!

ఒంట్లో ఓపిక లేదు!

ఆకలి!

నిలబడనియ్యదు!!

అందుకే ఈమధ్య

చుట్టు పక్కల హైస్కూళ్లకీ, వీధి బడులకీ వెళ్ళి, అక్కడి టీచర్స్‌తో తన స్థితి అంతా చెప్పుకుని అడుక్కుంటున్నాడు!

కొందరైతే కసిరి కొట్టేవారు!

మరికొందరు తరగతి గదుల్లోకి పోయి అడుక్కో-మనేవారు!

పసి పిల్లలు – తల్లి దండ్రుల్ని ఏ చాక్లెట్టులకో – బిస్కట్లకో కొనుక్కొని తినడానికి తెచ్చుకున్న ఐదు – పది పైసల బిళ్లల్తో రాఘవయ్య జేబైతే నిండి-పోయేది కానీ – ఒక్క రోజు ఆకలి తీరేది కాదు!

ఇలా – స్కూళ్లకి తిరుగుతున్నప్పుడే ఎవరో చెప్పారు –వృద్ధ కళా కారులకి ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది! ప్రయత్నించుకోండి–" అని!

రాఘవయ్య తుప్పు పట్టిన తన ట్రంకు పెట్టె తెరిచి గుడ్డ సంచీలో తాను ప్రాణ ప్రదంగా దాచు-కున్న కాగితాల్ని వెదికి తీసాడు!

అవి సుమారు ముప్ఫై, నలభై యేళ్ల క్రితం తన నటనని కొనియాడుతూ పత్రికలు వ్రాసిన సమీక్షలు – ప్రముఖులు ఇచ్చిన అభినందన పత్రాలూ!!

మాసిపోయి, పట్టుకుంటే చిరిగి పోడానికి సిద్ధంగా ఉన్న ఆ కాగితాల కట్టలో నుండి రంగ్ మంటూ పడింది ఓ వెండి పతకం!!

రాఘవయ్య సాలోచనగా ఆ వెండి పతకాన్ని చేతిలోకి తీసుకుని చూసాడు!!

ఆప్యాయంగా తడిమి చూసాడు దాన్ని!! వెనుకటి స్మృతులు రేగాయి!! అవి రాఘవయ్య యౌవ్వ-నంలో ఉన్న రోజులు

ఇంకా అప్పటికి దేశానికి స్వతంత్రం రాలేదు!!

రాజమండ్రి డివిజన్‌కి 'డేవిడ్' దొర కలక్టర్! ఆయన మహా సంస్కృతాభిమాని! ముఖ్యంగా కాళి-దాసు శాకుంతలం అంటే ఆయనకు మహా ప్రీతి!!

ఆయన రాఘవయ్య పేరు విని కబురు పెట్టాడు!

రాఘవయ్యగారూ! అభిజ్ఞాన శాకుంతలం ప్రదర్శించగలరా?? ఇంగ్లీషులో ప్రశ్నించాడు రాఘవయ్యను!

"అయ్యా! నెల రోజులు వ్యవధి కావాలి! ప్రయత్నిస్తాను!!

సంస్కృతం నేర్చిన పండితులు మా దేశంలో చాలమంది ఉన్నారు! కానీ వాళ్ళకి నటనపై అంత ఆసక్తి లేదు!! పరిమిత పాత్రలతోటి, దొరగారి కోసం ఒకటి, రెండు అంకాలు మాత్రం ప్రదర్శిస్తాను!!" అన్నాడు

సరళ సంస్కృత భాషలో రాఘవయ్య చెప్పిన సమాధానం డేవిడ్ దొరను తృప్తి పరిచింది!

అంతవరకూ కుర్చీలో కూర్చున్న దొర లేచి నిలబడి 'సరే మీరు కోరుకున్న వ్యవధి తీసుకోండి! ప్రదర్శనకు సిద్ధులై నన్ను కలవండి!!, అంటూ సాదరంగా సాగనంపాడు!!

నెల రోజులు అహర్నిశలూ సమాజంతో సాధన చేయించాడు!

శాకుంతలం నాటకం తనకు బోధిస్తున్నప్పుడు తండ్రి చెప్పిన విశేష వ్యాఖ్యలన్నీ మననం చేసు-కున్నాడు రాఘవయ్య!



ఇటీవల ఆంధ్రా ఆర్ట్స్ అకెడెమీ (విజయవాడ) వారి ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శన చేసిన చి మురళీ-మనోహర్, సహాయకుడు చి రమణ కుమార్‌లని చిత్రంలో చూడవచ్చు

## మ్రోగని మువ్వ

ప్రదర్శన రాజమండ్రిలో!

దుష్యంతుని పాత్రలో రాఘవయ్య అమోఘమైన నటనని చూసి దొర పరవశించి పోయాడు!

నిండు సభలో ఆయన రాఘవయ్యని సత్కరించి, ఆ సందర్భంలో రాఘవయ్యకి వెండి పతకం బహూక-రించాడు!!

* * *

ఏనాటి కథ ఇది? సుమారు నలభై ఏళ్ళ క్రితం నాటి రాఘవయ్య నట జీవితంలోని స్వర్ణ ఘట్టం!!

ఏరీ? ఎక్కడ??

ఈనాడు అల్లాంటి సహృదయ ప్రేక్షకులు ఎక్క-డున్నారు?

భాషా జ్ఞానం, ఔచిత్య జ్ఞానం, రస ధోరణి, నాటక మర్యాదలూ తెలిసిన వాళ్ళేరీ??

రాఘవయ్య చెక్కిళ్ళ మీంచి కారే కన్నీళ్ళు దోసిట్లోని వెండి పతకాన్ని తడుపుతన్నాయ్!!

మరో గంటలో రాఘవయ్య కలక్టరాఫీసులో క్లర్కు ముందు చేతులు కట్టుకుని నిలబడ్డాడు! చేతిలో ధరఖాస్తు!!

చెప్పండి! ఏవిటి మీ కథ? సిగరెట్టు పొగ వదులుతూ అడిగాడు క్లర్కు రాఘవయ్యని!

రాఘవయ్య చేతిలోని పేపర్ కట్టింగ్‌లు, దరఖాస్తు, బల్లమీదుంచి తన కదంతా చెప్పు-కున్నాడు!

అంతా విని క్లర్కు అన్నాడు చూడండి! ఇల్లాంటి ఫన్లన్నీ కాగితాల తోటి జరిగిపోవు! నేను మీ గురించి గట్టిగా రాయాలి! అయ్యగారు 'సఫార్స్ చేసి హైదరాబాద్ పంపాలి! అక్కణ్ణుంచి పెంక్షన్ శాంక్షన్ అయి రావాలి! సరే! అదంతా నేను చూసుకుంటా


**60 రోజులు ఉచితంగా ట్రయల్**

పండుగ ప్రత్యేక ఆఫర్

# టేపురికార్డర్ ఉచితం



నేషనల్ ఆర్వరల్డ్ టు--ఇన్--వన్ మోడల్ --84తో ట్రాన్సిస్టర్‌ను పొందండి ప్యాకేజీ పోస్టేజీ అండ్ అమ్మకం పన్నుతో చేరి సెట్టు రు 175లకే ప్రతి సెట్టుతోపాటు ఒక క్యాసెట్ టేపురికార్డర్‌ను ఉచిత బహుమతిగా పొందవచ్చు. తృప్తిపడని పక్షంలో తిరిగి చెల్లింపు లేదా మరొకటి మార్చుకోడానికి గ్యారంటీ మీపేరు మరియు చిరునామాతో ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే వెంటనే మీ ఆర్డరును పోస్టుద్వారా పంపండి. అడ్వాన్సు అవసరంలేదు

**Olyampic Traders (u)**

**Post Box No : 9425, DELHI-51**

**HOW TO BECOME A**

**MANAGEMENT TRAINEE**

**(your passport to the elite cadre)**

*The first publication gives selection procedure and the second contains preparatory material for management trainees recruitment tests*

**AUTHOR Vinod K. Gambhir, MBA (USA), Mng Dir**

● **MANAGEMENT TRAINEES SELECTION HANDBOOK**

Pub 1983 Price Rs 40/-

Selection details of 87 organisations including BHEL, DCM, TELCO, HM, ITDC, FCI, Indian Oil, STC & SAIL Eligibility, selection criteria, training, bond, remuneration etc

■ **MANAGEMENT TRAINEES RECRUITMENT TESTS**

Our success oriented self-study course prepares candidates for management trainees recruitment tests conducted by companies, govt undertakings, banks etc 308 foolscap pages

Course Rs 105/- Prospectus Rs 5/-

*Mailing Charges* | Rs 4/- for ●, Rs 6/- for ■, Rs 6/- for ● and ■ combined

*Send MO/BD TODAY For VPP send Rs 10/- to*

DBMC

**Dynamic Business Management Centre Pvt Ltd.**, Janakdeep (NC), 8 Community Centre, East of Kailash New Delhi-110065 Tel 6418691

estd 1975

**The sure way to reach the very top.**

కానీ మీరు కూడా కొంచెం నన్ను చూడండి మరి - సాభిప్రాయంగా నవ్వాడు!

అయ్యా మీ మేలు మరిచిపోను! పించన్ రాగానే తమకు ఏదో ఉడతా భక్తిగా సమర్పించు-కుంటాను-

క్లర్కు సిగరెట్టు పొగ గట్టిగా వూదాడు!!

చూడండి! ఆ పొగ మళ్ళీ నోట్లోకి తెప్పించగలమా? అల్లాగే చేజేరిన ఫైలు కూడా! పించన్ చేతులో పడ్డాక మళ్ళీ కనబడతారటయ్యా మీరు? అదేం లాభం లేదు! వెళ్ళండి! ఈ కాగితాలు కదలాలంటే వంద అవుతుంది!!

రాఘవయ్య హతాశు డయ్యాడు!

వంద రూపాయలా!!!

తినడానికి గతిలేని తనకి వంద రూపాయ లెక్కణ్ణుంచి వస్తాయ్!

ఆఫీసు మెట్లు దిగుతుంటే ప్రొద్దుటే ట్రంకు పెట్లోంచి బైటపడి, కళ్ళ బడ్డ వెండి పతకం గుర్తొచ్చింది!!

ఆ సాయంత్రం రాఘవయ్య!

బంగారం కొట్లో ఆ పతకాన్ని కొట్టు యజమాని చేతికిచ్చి కూర్చున్నాడు!

ఆ ఆసామీ ఆ పతకాన్ని అటూ ఇటూ తిప్పి చూసి పెదవి విరిచాడు!

రాఘవయ్య ఆత్రంగా అడిగాడు ఏం బాబూ??

ఇల్లాంటివి మాకు అక్కర్లేదండి! వీటిని కరిగిస్తే మాకు వచ్చే దెంతో పోయే దెంతో పాత వెండి!!

అదేవిటి బాబూ! అది అయిదు తులాల బరువు!!

మళ్ళీ కొట్టు ఆసామీ అటూ ఇటూ త్రిప్పి చూసి సరే మీరు గనక - కష్టాల్లో ఉన్నా-నంటున్నారు కనుక, ఓ యాభై రూపాయ లిస్తాను! మీ కిష్టమైతే ఇవ్వండి! లేకపోతే ఇదిగో! పట్టు-కెళ్ళండి!!

రాఘవయ్య ఆకలి ముందు ఓడిపోయాడు!!

'సరే! మీ ఇష్టం!

కొట్టు యజమాని ఏ కళ నున్నాడో ఇంకో పది రూపాయలు కూడా కలిపి రాఘవయ్య చేతిలో మొత్తం అరవై రూపాయ లుంచాడు!!

మర్నాటి సాయంకాలానికి రాఘవయ్య చేతిలోని అరవై రూపాయలూ కలక్ట రాఫీసులోని క్లర్కు జేబులోకి వెళ్ళి - చీకటి పడేసరికి బ్రాందీగా మారి అతని గొంతులోకి జారిపోయాయ్!!

మరో పది రోజులకి రాఘవయ్య మళ్ళీ క్లర్కును కలిసాడు!

ఇదిగో! చూడండి! మీ పని నెలా, రెండు నెలల్లో అయ్యేదికాదు! మళ్ళీ మళ్ళీ వచ్చి నన్ను విసిగించ-కండి! పెంక్షన్ శాంక్షన్ అవుతే అర్డరు మీ ఇంటికే పంపుతాం! వెళ్ళి రండి- క్లర్కు కోపంతో ఇచ్చిన సమాధానం అది!!

రాఘవయ్య కాళ్ళీడ్చుకుంటూ ఇంటి దారి పట్టాడు!

## జపాన్ పిల్లల చదువు!

జపాన్‌లో బడికి వెళ్ళి చదువుకునే పిల్లలు గల కుటుంబం నెలకు సగటున రు 2,950లు తమ పిల్లల చదువు కోసం వ్యయం చేయవలసి వస్తుంది అంటే ఈ వ్యయం కుటుంబ బడ్జెట్‌లో 21 శాతం దాకా వుందని టాక్యో నగరపాలక సంఘం ఇటీవల నిర్వహించిన సర్వే తెలుపుతూ వుంది

బడికి వెళ్ళి చదువుకునే ఇద్దరు పిల్లలు గల కుటుంబానికి ఖర్చు నెలకు సగటున రు 14 వేలు వుంటుంది దీనితో పిల్లల చదువుకయ్యే ఖర్చు రు 3,000 వుంటుంది 1982 నవంబరు నాటికంటే 1983 నవంబరు నాటికి జపాన్‌లో పిల్లల చదువుకయే ఖర్చు 13 8 శాతం పెరిగింది నెలసరి చదువుకయ్యే మూడు వేల రూపాయల ఖర్చులోరు 1750 లు బడి ఖర్చులు, రు 850 ట్యూషన్ ఫీజు, రు 400 లు సంగీత పాఠాలు మున్నగు సాంకేతిక కళాపాలకు ఖర్చు అవుతాయి

ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో కంటే ప్రయివేటు విశ్వ విద్యాలయాలలో ట్యూషన్ ఫీజు 2 4 రెట్లు ఎక్కువగా వుంది అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు 3 5 రెట్లు ఎక్కువగా వున్నాయి (జ వా)

ఒంట్లో ఓపిక ఉంటే చుట్టు పక్కల ఎ హోటళ్ళకో వెళ్ళడం - తెచ్చుకున్న డబ్బుల్తో గంజి కాచుకు తాగడం! లేకపోతే పస్తు లుండడం!!!

రాఘవయ్య ఆకలి పోరాటంలో మరో ఏడు కూడా గడిచింది

పోస్టుమేన్!!

మద్యాహ్నం రెండు గంటలకి ఉత్తరాలు పంచ-డానికి వస్తుంటాడు!!

రోజూ అతనికోసం నిరీక్షణ!!

అతడు రాఘవయ్య ఇంటి కేసి కూడా చూడకుండా పోతాడు!!

రాఘవయ్య నిట్టూరుస్తూ లోనికి పోతాడు!

వస్తుంది! తప్పకుండా వస్తుంది! ఫించను వస్తే - ఏదో గంజి నీళ్ళు తాగి ఇంట్లో పడుండచ్చు! ఒంట్లో తిరిగే శక్తి లేదు!! ఇవ్వేళ కాకపోతే రేపైనా వస్తుంది!!

ఆ రేపు

మళ్ళీ మామూలే!!

చివరికో రోజు రోడ్డు మీది కెళ్ళి పోష్టుమేన్‌ను అడిగాడు కూడాను!

నాయనా! నా పేరున ఏవైనా ఉత్తరాలు ఉన్నాయా?

గత ఐదు సంవత్సరాలుగా తనని ఏమాత్రం పట్టించుకోని రాఘవయ్యగారు ఆశతో ఏదో ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నారంటే పోస్టు-మేన్ మొదట ఆశ్చర్య పోయినా - చివరికి అడిగాడు!

ఏం రాలేదు సార్!! అయినా మన కెక్కణ్ణుంచైనా రావల్సిన లెటర్ ఉందాండీ??

రాఘవయ్య తనలో తాను మాట్లాడు-కుంటున్నట్టు చెప్పాడు


రావాలయ్యా! రావాలి!! పింఛన్ ఆర్డరు రావాలి! అప్పుడే కాగితం పెట్టి ఏడాది అయిపోయింది!!'

పెద్దవారు! నా గురించి ఎదురు సూడకండి సార్! మీకు రావాల్సిన లెటర్ రానీండి! పువ్వుల్లో పెట్టి మీకు అప్పగిస్తాను!! సెలవండి!!

సైకిల్ తొక్కుకుంటూ పోయాడు పోష్టుమేన్!

కాలం గడుస్తూనే ఉంది!

రాఘవయ్య మరింత క్రుంగి పోయాడు!! వంగిపోయాడు!!



ఇల్లు దాటి కదల్లేక పోతున్నాడు!!

వానాకాలం!! మదపు టేనుగుల్లా మేఘాలు గర్జిస్తూనే ఉన్నాయ్! ఆకాశం, రాత్రీ పగలూ ఒక్కటే ఏడుపు!!

రాఘవయ్య జ్వరంతో మూసిన కన్ను తెరవకుండా పడున్నాడు!

మూడు రోజుల నుంచి అల్లాగే పడున్నాడు!

పై పెంకులు బద్దలైన ఆ ఇంట్లో ఏ మూలకి మంచం జరుపుకున్నా రాఘవయ్యపై వర్ష ధారలు పడుతూనే ఉన్నాయ్!!

రాఘవయ్య ఓడిపోయాడు!

బ్రతుకుతో – ఆకలితో – ముసలితనంతో పోరాడి పోరాడి, నేల కొరిగిన వీర యోధునిలా పడిపొయ్యాడు!!

వర్షం వెలిసింది!!

ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటి మీదా – ఈ ఇంటి మీది కాకి ఆ ఇంటిమీదా వ్రాలడం మొదలు పెట్టాయ్!!

క్షణంలో రాఘవయ్యగారు చచ్చిపోయారన్న వార్త ఆ వీధంతా పరుగెత్తింది!!

రాఘవయ్య బొందిలో ప్రాణం ఉండగా ఆ గడప త్రొక్కని వాళ్ళంతా రాఘవయ్య ఇంటి ముందు చేరుకున్నారు!!

అందరిలో ఆత్రం!! కంగారు!!

కాస్సేపట్లో మోటారు బండిపై వచ్చి దిగాడు! ఆ వార్డు కౌన్సిలర్ రాజారావ్! వెనకాల ఆయన మద్దతు దారులు!!

## 'మతం'

'మానవ జీవన సంస్కృతీ
మొగలి వనం'లో
ముసలు కొట్టి - విషం కక్కే
కాలనాగు

–సుహాసిని

## మ్రోగని మువ్వ

గుమ్మంతో మూగిన జనం ప్రక్కకు తప్పుకుని దోవ ఇచ్చారు! ఆయన సిద్ధంగా తన వెంట తెచ్చుకున్న దండ రాఘవయ్య బౌతిక కాయానికి వేసి భక్తిగా నమస్కరించాడు!!

మరో గంటికి ఛైర్మెన్‌గారి కారు కూడా రాఘవయ్య ఇంటి ముందుకు వచ్చి ఆగింది!! కౌన్సిలర్‌గారు ఎదురు వెళ్ళి ఛైర్మన్‌గారిని తీసుకు వచ్చారు! ఆయన కూడా రాఘవయ్య భౌతిక కాయాన్ని పుష్పమాలాలంకృతం చేసాడు చుట్టూ జనాన్ని ఉద్దేశించి ఉపన్యసించాడు

"మిత్రులారా! నేడు దుర్దినం! రాఘవయ్యగారు మన కిక లేరు! ఆయన వెనుకటి తరానికి చెందిన మహా నటుడు!! తెలుగు నాటక రంగానికి వారు చేసిన సేవ అపూర్వమైనది! మీలో యువకులకు చాల మందికి రాఘవయ్యగారి నటన తెలియక పోవచ్చు! మా చిన్న తనంలో రాఘవయ్యగారి నటనంటే – పడి చచ్చే వాళ్ళం!! ఆయన కిదే నా శ్రద్ధాంజలి! ఆయన అంత్యక్రియల నిమిత్తం రెండు వందల రూపాయలు విరాళంగా ఇస్తున్నాను!!

జనం చప్పట్లు కొట్టేసారు! పిచ్చి జనం! అదొక్కటే వీళ్ళకి వచ్చిన విద్య!! పిడుక్కీ, పెళ్ళికీ ఒకటే మంత్రం!!

ఎవరో యువ నట సమాఖ్య సభ్యులు రాఘవయ్య బౌతిక కాయాన్ని మోసుకు పోవడానికి ఆయత్త పడుతున్నారు!

మళ్ళీ మబ్బులు మూసాయి!! వర్షం పడుతూంది!

అప్పుడే

రాఘవయ్య పేరు మీద వచ్చిన పెంక్షన్ ఆర్డరు కవరుని పట్టుకొని వచ్చిన పోష్టుమేన్ – విభ్రాంతిగా నిలబడి పొయ్యాడు రాఘవయ్య ఇంటి ముందు!!

రాఘవయ్య శవం కదిలింది!

ఆకాశం ఘోరున ఏడుస్తూనే ఉంది!! □

## అంకితం

ఒకప్పుడు నటరాజ పాద మండీరంలో మువ్వలై మ్రోగి- కాలాంతంలో ముదిసి, మాసి, మూగవై, మాటకు విసిరివేయ బడిన మువ్వలకి, ఆదే, విస్మృత వృద్ధ కళాకారులకు ఈ నా కధ-

–రచయిత


60 రోజులు ఉచితంగా ట్రయల్

పండుగ ప్రత్యేక ఆఫర్

# టేపురికార్డర్ ఉచితం



నేషనల్ ఆల్ వరల్డ్ టు–ఇన్–వన్ మోడల్ –84తో ట్రాన్సిస్టర్‌ను పొందండి ప్యాకేజీ పోస్టేజీ అండ్ అమ్మకం పన్నుతో చేరి సెట్టు రు 175లకే ప్రతి సెట్టుతోపాటు ఒక క్యాసెట్ టేపురికార్డర్‌ను ఉచిత బహుమతిగా పొందవచ్చు. తృప్తిపడని పక్షంలో తిరిగి చెల్లింపు లేదా మరొకటి మార్చుకోడానికి గ్యారంటీ మీపేరు మరియు చిరునామాతో ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే వెంటనే మీ ఆరరును పోస్టుద్వారా పంపండి. అడ్వాన్సు అవసరంలేదు.

**DEEPAK ENTERPRISES (U)**

**86, Govind Nagar, AMBALACANTT**

# ఆకర్షనీయమైన బహుమతులను గెలుచుకోండి



**మొదటి బహుమతి**
యెజ్డీ మోటారు సైకిల్ లేక
రూ. 14000/- నగదు

**రెండవ బహుమతి**
కలర్ టి వి. లేక
రూ. 9500/- నగదు

**మూడవ బహుమతి**
- 3 స్పీడ్ గ్రైండర్/టేప్ రికార్డర్ రూ. 500/- కు రియాయితీ ధరపై
- 2 స్పీడ్ మిక్సర్/గ్రైండర్ రూ. 325/- కు రియాయితీ ధరపై లేక టూ-ఇన్-వన్ రియాయితీ ధరపై రూ. 900/- కు
- టూ బ్యాండ్ ట్రాన్సిస్టర్ రూ. 225/- కు రియాయితీ ధరపై

క్రింద యిచ్చిన 3 లైనులలో 12 నుంచి 20 వరకు అంకెలను ఉపయోగిస్తూ వాటి మొత్తం 48 వచ్చే టట్లుగా (నిలువుగా, అడ్డంగా, ఐమూలగా) చేయబడింది

| | | |
|---|---|---|
| పదమూడు | పద్దెనిమిది | పదిహేడు |
| ఇరవై | పదహారు | పన్నెండు |
| పదిహేను | పద్నాలుగు | పందొమ్మిది |

**మీరు చేయవలసింది ఏమిటి-**
3 లైనులలో 13 నుంచి 21 వరకు అంకెలను ఉపయోగిస్తూ వాటి మొత్తం 51 వచ్చేటట్లుగా (ఒక అంకెను ఒకే సారి వాడాలి) చేయాలి

తెల్ల కాగితం మీద ఎంట్రీలను వ్రాసి 15 రోజులలోగా పంపాలి విజేతలకు పోస్టు ద్వారా తెలియచేయబడును న్యాయమూర్తుల నిర్ణయం అంతిమమైనది. ఢిల్లీ అధికారానికి లోబడి ఉంటుంది,

**SHALIMAR TRADERS (Tel)**

**POST BOX NO 9431, DELHI-110051**